వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 047
పేజీలు : 09 | వెల: రూ.5/-
గురువారం
జనవరి 29, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

9లో..



# కేసీఆర్ కు సిట్ నోటీసులు

- శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ

వివరాలు2,8,9లో..



# పులకించిన మేడారం

- అడవిలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం
- గద్దెపైకి చేరిన సమ్మక్క
- స్వాగతం పలికిన కలెక్టర్ దివాకర టీఎస్
- గాల్లోకి కాల్పులు జరిపి ఆహ్వానించిన ఎస్పీ కేకన్

శివసత్తుల పూనకాలు, భక్తుల కేరింతలతో మార్మోగిన జాతర కోట్లాది మంది భక్తులు ఎదురు చూస్తున్న అద్భుత దృశ్యం మేడారంలో ఆవిష్కృతమైంది. భక్తుల జయజయధ్వానాల మధ్య సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరింది. మేడారం నుంచి వెళ్లిన పూజారులు చిలకలగుట్టలో గంటపాటు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్లు, దివిటీల వెలుగులు, కోయ కళాకారుల నృత్యాలు, ఆదివాసీ తెగల భక్తపారవశ్యం మధ్య సమ్మక్క వనం వీడి జనం మధ్యలోకి తరలివచ్చింది. చిలకలగుట్టనుంచి కిందికి వచ్చిన సమ్మక్కకు ప్రభుత్వం తరపున కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలుకగా, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ గాల్లోకి కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో వనదేవతకు స్వాగతం పలికారు. లక్షాలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారి రాకను చూసి పులకించిపోయారు. శివసత్తుల పూనకాలు, భక్తుల కేరింతలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. సమ్మక్క తల్లి రాక నేపథ్యంలో 'జై సమ్మక్క' అంటూ మేడారం పరిసరాలు మార్మోగాయి. సమ్మక్క తల్లి గద్దెల దగ్గరకు చేరుకోగానే పూజారులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. సమ్మక్కతోపాటు సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై కొలువుదీరడంతో జాతరకు పూర్ణత్వం లభించినట్లైంది. శుక్ర, శని వారాలు భక్తుల దర్శనార్థం వనదేవతలు గద్దెలపైనే ఉంటారు. 31వ తేదీ సాయంత్రం దేవతల వన ప్రవేశంతో జాతర ముగుస్తుంది.

– వరంగల్ వాయిస్, మేడారం



## దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం

- అధిక నిధులతో శాశ్వత అభివృద్ధికి కృషి
- మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క

## కేంద్ర మంత్రుల సందర్శన

2లో..





# పులకించిన మేడారం

- అడవిలో అద్భుత దృశ్యం ఆవిష్కృతం
- గద్దెపైకి చేరిన సమ్మక్క
- స్వాగతం పలికిన కలెక్టర్ దివాకర టీఎస్
- గాల్లోకి కాల్పులు జరిపి ఆహ్వానించిన ఎస్పీ కేకన్
- శివసత్తుల పూనకాలు, భక్తుల కేరింతలతో మార్మోగిన జాతర

మేడారం జాతరలో రెండో రోజు అత్యంత కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. గురువారం సాయంత్రం గిరిజన సంప్రదాయ పూజల అనంతరం చిలకలగుట్ట నుంచి భక్తుల కోలాహలం, భారీ బందోబస్తు మధ్య సమ్మక్క తల్లి వనం వీడి జనం మధ్యలోకి తరలివచ్చింది. చిలకలగుట్టలో గంటపాటు పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్లు, దివిటీల వెలుగులు, కోయ కళాకారుల నృత్యాలు, ఆదివాసీ తెగల భక్తపారవశ్యం మధ్య సమ్మక్క అడవి నుంచి మేడారం గద్దెపైకి చేరుకుంది. అంతే.. అమ్మ రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న భక్తులు పూనకంతో ఊగిపోయారు. సమ్మక్క తల్లి నామస్మరణతో వనం దద్దరిల్లింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని తీసుకువచ్చే సమయంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సమ్మక్క తల్లి రాకతో వనదేవతలందరూ గద్దెలపై కొలువుదీరినట్లయింది. తండోపతండాలుగా తరలివస్తున్న భక్తులు నిలువెత్తు బంగారాన్ని అమ్మవార్లకు మొక్కుగా చెల్లించుకుంటున్నారు. జంపన్నవాగులో సంప్రదాయ స్నానాలు ఆచరిస్తున్నారు. జంపన్నవాగు జనసంద్రాన్ని తలిపిస్తోంది.

అయితే జాతరలో సమ్మక్క తల్లిని గద్దెలపైకి తీసుకొచ్చే ప్రక్రియ సవాలుతో కూడిన పనే అని చెప్పాలి. సమ్మక్క తల్లి చివరిసారిగా అదృశ్యమైన చిలకలగుట్టపైకి వెళ్లి గిరిజన పూజరులు అమ్మవారిని కుంకుమ భరిణె రూపంలో తీసుకువస్తుంటారు. సమ్మక్క తల్లి గురువారం సాయంత్రం చిలకలగుట్ట కిందకు వచ్చే సమయంలో గౌరవసూచకంగా జిల్లా ఎస్పీ గాల్లోకి కాల్పులు జరుపుతారు. ఈ సమయంలో అక్కడ ఉద్వేగభరిత వాతావరణం నెలకొంటుంది. సమ్మక్క–సారలమ్మలు ఇద్దరు గద్దెలపై కొలువుదీరిన తర్వాత ఆ వనదేవతలను దర్శించుకునేందుకు, మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు.

### 30న కార్యాలయాలకు సెలవు..

మేడారం మహాజాతర సందర్భంగా ఈ నెల 30వ తేదీ శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యా సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ స్థానిక సెలవుకు బదులుగా ఫిబ్రవరి 14వ తేదీ రెండో శనివారంను పనిదినంగా పరిగణించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు, విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంతకు ముందే ములుగు జిల్లా కలెక్టర్ తోపాటు మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కూడా శుక్రవారం సెలవు ప్రకటిస్తూ నోట్ విడుదల చేశారు.



## వనదేవతలను దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి



**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం వన దేవతలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దంపతులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వారికి ఆదివాసీ సాంప్రదాయ కళాకారుల నృత్య ప్రదర్శన ద్వారా మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికారు. శ్రీ సమ్మక్క, సారలమ్మలకు నిలువెత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనదేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతోపాటు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లురి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని తల్లులను వేడుకున్నామని తెలిపారు. చరిత్రాత్మక కట్టడాలు దేశప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయన్నారు. గతం కంటే ఈ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారని పేర్కొన్నారు.



## కేంద్ర మంత్రుల సందర్శన

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా వెలుగొందుతున్న శ్రీ సమ్మక్క–సారమ్మ మేడారం జాతర రెండో రోజు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరమ్ విచ్చేయగా వారికి రాష్ట్ర మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవార్లను దర్శించుకుని, నిలువెత్తు బంగారం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కుంభ మేళాను తలపించే విధంగా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని, ఇక్కడికి వచ్చే భక్తుల కోసం శాశ్వత ఏర్పాట్లు చేశామని మంత్రి సీతక్క వారికి తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని అనేక మార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానితో చర్చించి జాతీయ పండుగ గుర్తింపు అందించాలని సీతక్క కోరారు. కాగా ప్రధానమంత్రి ఆదేశాల మేరకు మేడారం జాతర అభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన శాఖ మంత్రి జుయల్ ఓరమ్ తెలిపారు. మేడారం మహా జాతరకు వచ్చి అమ్మవార్లను దర్శించుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ, గిరిజనులు సైతం మేడారం మహా జాతర గురించి తెలుసుకోవాలని, రాబోయే రోజుల్లో ఇక్కడి అమ్మవార్లను దర్శించుకోవాలని వారు పేర్కొన్నారు. జాతరలో ఏర్పాట్లు బాగున్నాయని వారు కొనియాడారు. ఈ సందర్భంగా ఆదివాసి, గిరిజన, మేడారం భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రులను సత్కరించి చేసి, చిరు జ్ఞాపికలను అందించడం జరిగింది.



## తల్లులను దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని..

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ఉదయం అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని అమ్మవార్లను ప్రార్థించారు. అనంతరం జాతర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మేడారం జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



## మేడారం సందర్శించిన జర్నలిస్టులు

మహా జాతరలో భాగంగా గురువారం వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, స్పాట్ వాయిస్ డైరెక్టర్ పల్లెబోయిన నాగరాజు, జర్నలిస్ట్ పూజారి విజయ్ మేడారం సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రాలను కలిసి జాతరను విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు.

*–వరంగల్ వాయిస్, మేడారం*

# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

**• బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో రజక వృత్తిదారుల సమాఖ్య నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు మరియు రెండు కేంద్రపాలిత ప్రాంతాలలో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా వారిని ఎస్సీలుగా గుర్తించాలని దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వృత్తిదారుల సంక్షేమం కోసం ఆయన పలు డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉంచారు. రజక ఫెడరేషన్‌కు తక్షణమే పాలక మండలిని నియమించి, 50 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులందరికీ నెలకు రూ.5,000 పెన్షన్ అందించాలి. జిల్లా, మండల కేంద్రాలతో పాటు మున్సిపాలిటీల్లో రజక భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలి, తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆయన ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం రజక వృత్తిదారులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ హెచ్.ఎస్.ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెల్లి ప్రభాకర్, చిలుకల రాజు, ఇతర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# 'సమ్మక్క–సారలమ్మ' వీరగాథ ఇక వెండితెరపై

**◆ క్యూఆర్ కోడ్ ద్వారా సినిమా వీక్షణకు అవకాశం**

**వరంగల్ వాయిస్, గణపురం:** తెలంగాణ గిరిజనుల ఆరాధ్య దైవాలు, వీరోచిత తల్లీకూతుళ్లు సమ్మక్క–సారలమ్మల జీవిత చరిత్ర ఇప్పుడు దృశ్యరూపంలో భక్తుల ముందుకు వచ్చింది. వారి భక్తి, త్యాగం, అన్యాయంపై చేసిన పోరాటాన్ని ప్రతిబింబిస్తూ రూపొందించిన ఈ బయోపిక్, యూట్యూబ్‌లోని 'PROTV Channel' ద్వారా విడుదలైంది. చరిత్రలో నిలిచిపోయిన సమ్మక్క–సారలమ్మల గాథను నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని అత్యంత నిష్ఠతో తెరకెక్కించారు. గిరిజన సంస్కృతి, వారి జీవన విధానం మరియు ఆధ్యాత్మిక భావాలను ఈ సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారు. భక్తి చిత్రాలను ఇష్టపడే ప్రేక్షకులకు ఇది ఒక ప్రత్యేక అనుభూతిని అందించనుంది. ప్రేక్షకులు ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా ఈ చిత్రాన్ని వీక్షించేందుకు చిత్ర బృందం వినూత్న ఏర్పాట్లు చేసింది. ప్రతి ఒక్కరూ సులభంగా సినిమాను చూసేందుకు వీలుగా క్యూఆర్ (QR) కోడ్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా లేదా సోషల్ మీడియాలో షేర్ అవుతున్న లింక్ ద్వారా నేరుగా సినిమాను వీక్షించవచ్చు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి చిత్ర నిర్మాతలుగా జాబిల్లి శివ నాగేశ్వర రావు, సంతోష్ కుమార్ ఉబాలే వ్యవహరించారు. దర్శకత్వం, కథనం సంతోష్ కుమార్ ఉబాలే, కథ, మాటలు, పాటలు తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, సంగీతం నరి రాజ్ బొబ్బిలి, ఛాయాగ్రహణం జాబిల్లి రమేష్ లు వ్యవహరించారు. గిరిజన వీరవనితల పవిత్ర గాథను ప్రతి ఒక్కరూ వీక్షించి, సమ్మక్క–సారలమ్మల చరిత్రపై అవగాహన పెంచుకోవాలని చిత్ర బృందం కోరింది.




# ఒత్తిడి వీడండి.. పరీక్షల్లో రాణించండి

**◆ నిజామాబాద్ సీపీ సాయి చైతన్య**

**వరంగల్ వాయిస్, గణపురం:** "పదో తరగతి అనేది విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మైలురాయి. పరీక్షల సమయంలో ఎలాంటి ఆందోళనకు లోనుకాకుండా, ఒత్తిడి లేకుండా సన్నద్ధమైతేనే అద్భుత ఫలితాలు సాధించవచ్చు" అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతరాజు సాయి చైతన్య అన్నారు. గురువారం సీపీ సాయి చైతన్య జన్మదినాన్ని పురస్కరించుకుని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎంజేపీ ఆశ్రమ పాఠశాలలో 70 మంది పదో తరగతి విద్యార్థినులకు పరీక్షా సామాగ్రి (ప్యాడ్లు, పెన్నులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తమకు పరీక్షా సామాగ్రిని అందజేసినందుకు విద్యార్థినులు సీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణపురం సీఐ కరుణాకర్ రావు, భూపాలపల్లి సీఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్, గణపురం ఎస్ఐ రేఖ అశోక్, గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, గాంధీనగర్ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే కోటగుళ్ల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, ఆవుల కిరణ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





### కోటగుళ్లలో సీపీ సాయి చైతన్య పూజలు..

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోతరాజు సాయి చైతన్య గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలోని చారిత్రక కోటగుళ్లను సందర్శించారు. కాకతీయుల శిల్పకళా వైభవానికి నిలువుటద్దమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయంలో ఆయన తన జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టినరోజును పురస్కరించుకుని సీపీ సాయి చైతన్య గణపేశ్వర స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ఆధ్వర్యంలో గణపతి, నందీశ్వరుడు, గణపేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సీపీకి శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ వేడుకలో పాల్గొన్న పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, గణపురం సీఐ కరుణాకర్ రావు, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్ గౌడ్, ఎస్ఐ రేఖ అశోక్, గాంధీనగర్ సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్, కోటగుళ్ల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మల్లికార్జున్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణ కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి కిల్లు శివకుమార్ నాయుడు గురువారం సందర్శించారు. క్షేత్రస్థాయిలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతున్న తీరును ఆయన నిశితంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ల స్వీకరణ సాగుతుందా? లేదా? అనే అంశాన్ని అబ్జర్వర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల కేంద్రాల వద్ద అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలను, హెల్ప్ డెస్క్‌ల పనితీరును ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఉపయోగిస్తున్న 'టీ–పోల్' యాప్ పనితీరును కూడా ఆయన పర్యవేక్షించారు. రిపోర్టులను సకాలంలో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ సుధీర్ కుమార్, తహశీల్దార్ విజయ్, నోడల్ ఆఫీసర్ నరసింహమూర్తి, స్థానిక ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక మున్సిపాలిటీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల నగారా మోగుతున్న తరుణంలో అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పరకాల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బండారి కవిత కృష్ణ కాంగ్రెస్ పార్టీని వీడి, బీఆర్ఎస్ గూటికి చేరారు. గురువారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో బండారి కవిత కృష్ణ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చల్లా ధర్మారెడ్డి ఆమెకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. క్షేత్రస్థాయిలో పట్టున్న నాయకులు పార్టీలో చేరడం బీఆర్ఎస్ బలాన్ని మరింత పెంచుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరిన వెంటనే బండారి కవిత కృష్ణకు మాజీ ఎమ్మెల్యే కీలక బాధ్యత అప్పగించారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా ఆమె పేరును చల్లా ధర్మారెడ్డి అధికారికంగా ప్రకటించారు. వార్డు అభివృద్ధిపై అవగాహన ఉన్న నాయకురాలు కావడం వల్ల పార్టీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# యాదగిరి మృతి దళిత ఉద్యమానికి తీరని లోటు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు, ప్రముఖ అంబేద్కర్‌వాది, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కనకం యాదగిరి మరణం దళిత ఉద్యమానికి తీరని లోటని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. యాదగిరి గారి మృతి పట్ల డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్, రాజేందర్ మాట్లాడుతూ, యాదగిరి గారు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవించిన గొప్ప నాయకుడని కొనియాడారు. చిన్నతనం నుండే అంబేద్కర్ ఆలోచనలతో ప్రభావితుడై, పల్లె పల్లెనా అంబేద్కర్ యువజన కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తెచ్చారని గుర్తు చేసుకున్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన, స్నేహశీలిగా, మృదు స్వభావిగా అందరి గౌరవాన్ని పొందారని తెలిపారు. యాదగిరి సార్ ఆశయాలను, ఆయన ఆలోచనా విధానాన్ని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, అదే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ సంతాప కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకురాలు బొర్ర సంపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల అనిత, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, సాయి తదితరులు పాల్గొని యాదగిరి సేవలను స్మరించుకున్నారు.

# 'ప్యానెల్ ఇన్స్పెక్షన్' బృందం తనిఖీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ప్రభుత్వ పాఠశాలల పనితీరును మెరుగుపరచడం, విద్యాభివృద్ధిని పర్యవేక్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశించిన 'ప్యానెల్ ఇన్స్పెక్షన్' ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం పర్వతగిరి మండలంలోని సోమారం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రత్యేక తనిఖీ బృందం సందర్శించింది. ఉదయం ప్రార్థన సమావేశం నుంచి సాయంత్రం పాఠశాల ముగిసే వరకు బృందం సభ్యులు అక్కడే ఉండి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ గుండు రవి మాట్లాడుతూ.. విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల డైరీ, లెసన్ ప్లాన్స్, ఎఫ్ఎల్ఎన్ (తొలిమెట్టు), లిప్ రిజిస్టర్ల నిర్వహణ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం, లైబ్రరీ వినియోగం, విద్యార్థుల ఆటపాటలు, భోజనం నాణ్యత, వంటశాల నిర్వహణను తనిఖీ చేశారు. సోమారం పాఠశాలలో చేపట్టిన ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థుల హాజరుతో పాటు ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను బృందం సభ్యులు అంచనా వేశారు. ప్రాథమికోన్నత స్థాయి పరిశీలన బృందం నోడల్ అధికారులు కట్కూరి నరసింహులు, మెరుగు రఘుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండీ గౌస్ మోహినుద్దీన్, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, సంపత్ రావు, శైలజ, కవిత పాల్గొన్నారు.

# సాయి మందిరంలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండలోని షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు, పేద ప్రజల కోసం ఉచిత మొబైల్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బిర్లా ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 98 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు, నిరుపేదలకు సేవ చేయడమే షిరిడి సాయి సేవా సమాజ్ ప్రధాన ఆశయమని పేర్కొన్నారు. బాబా ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడతామని తెలిపారు. మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ప్రతి నెల కనీసం రెండు గురువారాలు క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ప్రకటించారు. బాబా సందేశాన్ని సేవా మార్గం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిద్ధార్థ రోగులను పరీక్షించి, తగిన వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది నవీన్, సుజాత, మందిర సిబ్బంది సాయి కృష్ణ రాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సేవలు అందించారు. ఉచితంగా వైద్య పరీక్షలు అందించి, మందులు పంపిణీ చేసిన నిర్వాహకులకు భక్తులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తుల కోసం రోడ్డు మరమ్మతులు



**వరంగల్ వాయిస్, దామెర:** మేడారం మహా జాతరను పురస్కరించుకుని కంఠాత్మకూర్ మీదుగా తరలివచ్చే భక్తులకు రాకపోకల ఇబ్బందులు కలగకుండా దామెర ఎస్సై కొంక అశోక్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కంఠాత్మకూర్ శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న తరుణంలో, రోడ్డుపై ఉన్న గుంతల వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గుర్తించి, టిప్పర్ల ద్వారా మొరం తెప్పించారు. ఎస్సై అశోక్ స్వయంగా అక్కడే ఉండి ఆ మొరంతో గుంతలను పూడ్చి, రోడ్డును చదును చేయించారు.

# శంకుస్థాపనలకే పరిమితమా?







## ◆ రోడ్డు పనులు మొదలయ్యేది ఎప్పుడు?

**వరంగల్ వాయిస్, భీమారం :** గ్రేటర్ వరంగల్ నగరం నడిబొడ్డున ఉన్నా.. పలివెల్పుల గ్రామస్తుల తలరాత మాత్రం మారడం లేదు. పలివెల్పుల ప్రధాన రహదారి అధ్వానంగా తయారై, గుంతలమయంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా, ప్రభుత్వాలు మారుతున్నా శంకుస్థాపనల మీద ఉన్న శ్రద్ధ.. పనులు ప్రారంభించడంపై లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

### రెండు ప్రభుత్వాలు.. రెండు శంకుస్థాపనలు..

ఈ రోడ్డు అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఆరూరి రమేష్ రూ. 2 కోట్లతో శంకుస్థాపన చేశారు. కానీ, ఆ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారి, 'ప్రజా పాలన' మొదలైన తర్వాత ప్రస్తుత వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కూడా మళ్లీ అదే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఇలా ఇద్దరు ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టారే తప్ప, ఒక్క అడుగు కూడా పని ముందుకు పడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నరకప్రాయంగా ప్రయాణం..

దుర్గ మాత గుడి నుండి ఎస్.ఆర్.ఎస్.పీ కెనాల్ వరకు ఉన్న కిలోమీటర్ మేర రోడ్డు వందల గుంతలతో నిండిపోయింది. రుద్రబాంబ ఫిల్టర్ బెడ్ నుంచి వృధాగా వస్తున్న నీరు చేరడంతో రోడ్డు కోతకు గురై పెద్ద కాలువలా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలివెల్పుల, కొత్తపల్లి, దుర్గానగర్ కాలనీ, సీపీఐ గుడిసెల వాసులకు ఈ రహదారి ప్రధాన దారి కావడంతో వేలమంది నిత్యం నరకాన్ని చూస్తున్నారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిరసనగా గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోబోమని, అసలు ఓటు వేయమంటూ సవాల్ విసురుతున్నారు. "ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇకనైనా మా గోడును పట్టించుకోవాలి. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించకపోతే ఎన్నికల బహిష్కరణ తప్పదు." అని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

# గోడ పత్రిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయం 'సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ అండ్ ఎంపవర్‌మెంట్' ఆధ్వర్యంలో మార్చి 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు గోడ పత్రికను వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి గురువారం ఆవిష్కరించారు. "లిటరేచర్, లీడర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్: విమెన్ షేపింగ్ వికసిత్ భారత్ 2047" అనే అంశంపై ఈ జాతీయ సదస్సు జరగనుంది. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో సాహిత్యం, నాయకత్వం మరియు ఆవిష్కరణల రంగాల్లో మహిళలు పోషిస్తున్న పాత్రను ఈ సదస్సులో చర్చించనున్నారు. సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ సమన్వయ అధికారిణి డాక్టర్ బి. దీపా జ్యోతి మాట్లాడుతూ.. ఈ సదస్సులో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించాలని కోరారు. ఆసక్తి గలవారు నిర్ణీత రుసుమును క్యాంపస్ కాలేజ్ ప్రిన్సిపాల్ 'నాన్ యూనివర్సిటీ ఫండ్' (Non-University Fund) ఖాతాలో చెల్లించి తమ పత్రాలను అందజేయవచ్చు. సదస్సుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.kakatiya.ac.in సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు డాక్టర్ బి.రమ, ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య పి.అమరావేణి, డాక్టర్ కె.మమత, ఆచార్య సి.జే.శ్రీలత, ఆచార్య టి.సవితా జ్యోత్స్న, డాక్టర్ ఎం.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **సజావుగా నామినేషన్ల స్వీకరణ**
- **జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా**




**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గురువారం జనగామ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్వీకరణ తీరు, రిజిస్టర్ల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. జనగామ మున్సిపాలిటీలో 30 వార్డులు, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో 18 వార్డులు మొత్తం 48 వార్డుల సభ్యుల ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరణ సజావుగా సాగుతోందని ఆయన వివరించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనవరి 30 సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే సమయం ఉందని కలెక్టర్ గుర్తు చేశారు. "చివరి నిమిషంలో హడావుడి పడి ఇబ్బందులు ఎదుర్కోకుండా, అభ్యర్థులు ముందే తమ నామినేషన్లను దాఖలు చేయాలి. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశాం." అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఎక్కడా పొరపాట్లు జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. రోజువారీగా దాఖలైన నామినేషన్ల వివరాలను వెంటనే ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, వారికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చామన్నారు. ఓటర్లు ఎవరికీ భయపడకుండా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు

◆ హనుమకొండలో భారీ ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల సమరం ముగింపు ఘట్టానికి చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 133 బార్ అసోసియేషన్ల పరిధిలో శుక్రవారం (జనవరి 30) పోలింగ్ జరగనుంది. అత్యంత హోరాహోరీగా సాగుతున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ న్యాయవాద వర్గాల్లో నెలకొంది. మొత్తం పోస్టులు 23 ఉండగా బరిలో 203 మంది అభ్యర్థులు ఉన్నారు. హనుమకొండ ఓటర్లు 1,041 మంది న్యాయవాదులు కాగా, ప్రాధాన్యత క్రమంలో (Preferential Voting) ఒక్కొక్కరు 23 ఓట్లు వేయవచ్చు. కనీసం 5 ఓట్లు వేస్తేనే బ్యాలెట్ చెల్లుబాటు అవుతుంది.



### పకడ్బందీ ఏర్పాట్లు..

హన్మకొండ జిల్లా కోర్టులోని "టెన్ కోర్టు కాంప్లెక్స్ సెల్లార్" లో పోలింగ్ కోసం సర్వం సిద్ధమైంది. హన్మకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, చీఫ్ పోలింగ్ ఆఫీసర్ పులి సత్యనారాయణ నేతృత్వంలో 16 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. "న్యాయవాదులంతా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్, వైద్య శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేశాం" అని పులి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిగేలా థర్డ్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సిరిసిల్ల ప్రియాంక అబ్జర్వర్‌గా వ్యవహరించనున్నారు. హన్మకొండ పోలింగ్ స్టేషన్‌కు 104వ నంబర్ కేటాయించారు.



### బరిలో స్థానిక అభ్యర్థులు..

ఈ ప్రతిష్టాత్మక ఎన్నికల్లో హన్మకొండ బార్ నుంచి ఏడుగురు, వరంగల్ బార్ నుండి నలుగురు అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. నెలరోజులుగా సాగిన ప్రచార పర్వం గురువారంతో ముగియగా, కోర్టు ప్రాంగణాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది. ఈ ఏర్పాట్ల పర్యవేక్షణలో బార్ ప్రధాన కార్యదర్శి కొత్త రవి, ఉపాధ్యక్షులు సిహెచ్ రమేష్, కోశాధికారి సిహెచ్. సాంబశివరావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కేయూలో సాహిత్య సందడి

• రాష్ట్రస్థాయి 'అవధాన' వేడుకలు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం స్థాపించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా భాషాభిమానులకు కనువిందు చేసే సాహిత్య కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. విశ్వవిద్యాలయ తెలుగు శాఖ, 'వరంగల్ పద్య కవితా వేదిక' సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి అవధాన ప్రక్రియ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను గురువారం కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషా గొప్పదనాన్ని, అవధాన విద్యలోని చమత్కారాన్ని నేటి తరానికి పరిచయం చేసేందుకు ఇదొక చక్కని వేదిక అని కొనియాడారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు మామిడి లింగయ్య, పాలకమండలి సభ్యులు చిర్ర రాజు, డాక్టర్ రమ, డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు. వీరితో పాటు ప్రసిద్ధ అవధాని శ్రీ రామ్, తెలుగు శాఖ అధ్యాపక బృందం డాక్టర్ కర్రే సదాశివ్, డాక్టర్ బానోత్ స్వామి మరియు ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు భాషా ప్రాభవాన్ని చాటిచెప్పే ఈ అవధాన కార్యక్రమంలో విద్యార్థులు, పరిశోధకులు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# రంజాన్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

■ అధికారులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశం



**వరంగల్ వాయిస్, జనగామ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. వచ్చే నెల 18 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆ లోపే ఈద్గాలు, మసీదుల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ శాఖ ఈద్గాల వద్ద నిరంతర తాగునీటి సరఫరా చేయాలి. అవసరమైన చోట్ల నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలి. మసీదుల వద్ద చెత్త డబ్బాలను ఏర్పాటు చేసి, పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. విద్యుత్ శాఖ ప్రార్థనల సమయంలో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరాను నిర్ధారించాలి. పోలీస్ శాఖ రాత్రి 11:30 గంటల వరకు దుకాణాలు నిర్వహించుకునేందుకు అనుమతినిస్తూనే, శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. హోటళ్లు, దుకాణాల వద్ద ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు లోబడి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. అధికారుల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేయాలని మైనారిటీ సంక్షేమ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో జనగామ ఆర్డీవో గోపి రామ్, ఏసీపీ భీమ శర్మ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్, తహశీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. మత పెద్దలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఏర్పాట్లు పూర్తి చేస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# కాళేశ్వరంలో మినీ మేడారం జాతర

## భక్తులకు అల్పాహారం, పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో సమ్మక్క–సారక్కల మినీ జాతర భక్తిపారవశ్యంతో సాగింది. జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ సమ్మక్క–సారక్క గద్దెల వద్ద గురువారం నాడు పండుగ వాతావరణం నెలకొంది. ఈ వేడుక భక్తితోనే కాకుండా, ఆదివాసీ ప్రజల ఆరాధన, భావోద్వేగాల కలయికగా నిలిచింది. పూజారులు కమ్మం మల్లక్క, కమ్మం సడవాలి ఆధ్వర్యంలో అమ్మవార్ల గద్దెల వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తమ కష్టాలను తీర్చి, చల్లగా చూడాలని కోరుకుంటూ భక్తులు తన్మయత్వంతో మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం కాళేశ్వరం 9వ వార్డు సభ్యులు సయ్యద్ ఇమ్రాన్, మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజు, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రామగుండం రాజేందర్ ప్రసాద్‌తో కలిసి భక్తులకు సేవలు అందించారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు, పూజారులకు అల్పాహారం, స్వీట్లు, అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకపోడ్ సంఘం సభ్యులు పెద్ది అజయ్, పొలం రాజశేఖర్, మాజీ వార్డు సభ్యురాలు మంగ లక్ష్మి మేఘన, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు నోటీసులు కాంగ్రెస్ దిగజారుడు రాజకీయానికి నిదర్శనం

చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడంపై పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలకు, అధికార మదానికి పరాకాష్ట అని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వం, తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌పై కక్ష సాధింపునకు దిగుతోందని విమర్శించారు. పాలన చేతకాక ప్రతిపక్ష నాయకులను విచారణల పేరుతో భయపెట్టడమే కాంగ్రెస్ అజెండాగా మారిందని ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు, నోటీసులతో దాడులకు దిగడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్ర సాధకుడు, కోట్లాది మంది ప్రజల గుండెల్లో ఉన్న కేసీఆర్‌ను ఇటువంటి నోటీసులతో భయపెట్టలేరని చల్లా స్పష్టం చేశారు. కేసీఆర్‌ను తాకడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకడమేనని, ఈ చర్యను బీఆర్ఎస్ పార్టీతో పాటు రాష్ట్ర ప్రజలెవరూ సహించరని హెచ్చరించారు. "కేసీఆర్ నిజాయితీపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉంది. రాజకీయ కుతంత్రాలతో ఆయన ప్రతిష్టను దెబ్బతీయాలనుకోవడం కాంగ్రెస్ భ్రమే. త్వరలోనే ప్రజలు ఈ అహంకార ప్రభుత్వానికి బుద్ధి చెబుతారు." ఈ రాజకీయ వేధింపులకు భవిష్యత్తులో గట్టి ప్రతిఘటన తప్పదని చల్లా ధర్మారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ఓటు హక్కు పవిత్రమైనది

**వరంగల్ వాయిస్, జనగామ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని జనగామ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, కల్నల్ డాక్టర్ మాచర్ల బిక్షపతి పిలుపునిచ్చారు. గురువారం జనగామ పట్టణంలోని క్రీస్తు జ్యోతి కాలేజీలో 'మేరా యువ భారత్' వరంగల్ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్ ఆదేశాల మేరకు ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కొత్తగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులకు 'మై భారత్' టీ–షర్ట్‌లు తొడిగి, శాలువాలు కప్పి, స్వీట్లతో ఘనంగా సన్మానించారు. ఓటు హక్కు నమోదు, దాని వినియోగంపై విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో క్రీస్తు జ్యోతి కాలేజీ డైరెక్టర్ ఫాదర్ విజయపాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి, మై భారత్ పూర్వపు వలంటీర్ మండ రాజేష్ గౌడ్, అర్చన, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# రెండో రోజు.. నామినేషన్ల జోరు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గ ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండో రోజు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. వివిధ వార్డుల నుంచి కౌన్సిలర్ అభ్యర్థులు తమ మద్దతుదారులతో తరలివచ్చి నామపత్రాలను అందజేశారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 5 ప్రత్యేక కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. రెండో రోజు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తరఫున సుమారు 35 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ పత్రాల నింపడంలో అభ్యర్థులకు తలెత్తే సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'హెల్ప్ డెస్క్' కు విపరీతమైన స్పందన లభిస్తోంది. ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు రాష్ట్ర పరిశీలకులు శ్యాం ప్రసాద్ లాల్ డోర్నకల్ కేంద్రాన్ని సందర్శించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును, అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలను స్వీకరించే సమయంలోనే వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి, నిబంధనల ప్రకారం ఎక్కడా పొరపాట్లు జరగకూడదు" అని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ నామినేషన్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుండగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది భారీ భద్రతను ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద కోడ్ నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

# సజావుగా ప్రయాణికుల రాకపోకలు



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మేడారం జాతర రవాణా అవసరాల దృష్ట్యా చిట్యాల పాయింట్ వద్ద ప్రయాణికుల రద్దీ కొనసాగుతోంది. చిట్యాల పాయింట్ ఇన్-చార్జిల పర్యవేక్షణలో రవాణా సౌకర్యాలను అధికారులు అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. తాజా నివేదికల ప్రకారం, ఈ పాయింట్ నుంచి మొత్తం 90 ట్రిప్పుల ద్వారా 4000 మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సుల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు.ఈ రవాణా కార్యకలాపాలను చిట్యాల పాయింట్ ఇన్-చార్జిలు సదా నందకుమార్, కే.కే.స్వామి, ఓ.ఎన్.రాములు, వీ.ఎల్. నారాయణ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆర్టీసీ సేవల పట్ల ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు
# కాంగ్రెస్ కక్షపూరిత రాజకీయమే



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ కక్షపూరిత ధోరణికి నిదర్శనమని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మండిపడ్డారు. ఈ చర్యను నిరసిస్తూ గురువారం సాయంత్రం బాలసముద్రం ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఆయన ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు నరెడ్ల శ్రీధర్, పులి రజనీకాంత్, వినయ్, ఉదిత్, వెంకన్న, రఘు, రాజేష్, రాజు, వీపీ రెడ్డి, శరత్ చంద్ర, రామ్మూర్తి, ఇతర బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# రాజీనామా చేసి గెలుప్... రాజకీయ సన్యాసం తీసుకుంటా

◆ ఎమ్మెల్యేకు దాస్యం బహిరంగ సవాల్

◆ అభివృద్ధి నిరంతర ప్రక్రియ..
నీతో మొదలు కాలేదు, నీతో ఆగిపోదు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ.. అది నీతో మొదలు కాలేదు, నీతో ఆగిపోదు. అధికార బలుపుతో పేదల గుడిసెలు కూల్చడం, పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం నీచ సంస్కృతి" అని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ప్రస్తుత ఎమ్మెల్యేపై నిప్పులు చెరిగారు. గురువారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన అత్యంత ఆవేశంగా మాట్లాడారు. ఎమ్మెల్యేపై వినయ్ భాస్కర్ నేరుగా సవాల్ విసిరారు. "నీకు నీ అభివృద్ధిపై నమ్మకం ఉంటే, ఈ జాతర ముగిశాక ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్ళీ గెలిచి చూపించు. ఒకవేళ నువ్వు గెలిస్తే నేను శాశ్వతంగా రాజకీయాల నుండి తప్పుకుంటా. ఇది నా ఓపెన్ ఛాలెంజ్" అని ప్రకటించారు. ఉప ఎన్నికల్లో గెలిచే సత్తా లేని వ్యక్తి కార్పొరేషన్‌లో 26 సీట్లు గెలుస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. భద్రకాళి చెరువు మట్టి అమ్మకంపై, కాంట్రాక్టర్ల దగ్గర తీసుకున్న కమీషన్లపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కేవలం కాళోజీ కళాక్షేత్రానికి రంగులు వేసి, తానే కట్టానని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. భద్రకాళి మాడవీధుల వద్ద పేదలు వేసుకున్న గుడిసెలను, దళితుల షాపులను కూల్చివేస్తున్నారని మండిపడ్డారు. పేదలకు పట్టాలు ఇచ్చే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. భద్రకాళి చెరువు పనులను సకాలంలో పూర్తి చేయకపోవడం వల్లే హన్మకొండ, వరంగల్ నగరం మునిగిపోయిందని, లక్షలాది రూపాయల ఆస్తి నష్టం జరిగిందని ధ్వజమెత్తారు.

## సంస్కారం లేని మాటలు..

"నేను నాలుగు సార్లు గెలిచినా ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టలేదు. నేను చదువుకున్న వాడిని, సంస్కారం ఉన్నవాడిని. నీలాగా విదేశాల్లో తిరగడం, క్లబ్‌లకు వెళ్లడం, కోళ్ల పందాలు ఆడటం నాకు తెలియదు" అని వ్యక్తిగత విమర్శలు చేశారు. నాయని నరేందర్ కుమారుడైన ప్రత్యర్థిని ఉద్దేశించి.. "నాయిని బాపు గారికి చేతులు జోడించి చెబుతున్నా.. నీ కొడుక్కి చిల్లర మాటలు మానేయమని చెప్పు" అని పేర్కొన్నారు.

## పోలీసులకు హెచ్చరిక..

పోస్టింగ్‌ల ఆశ చూపి పోలీసులతో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, ఇది సరికాదని హితవు పలికారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించే పోలీసులను తాము వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, మేకల బాబు రావు, పశ్చిమ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నగర సుందరీకరణకు కొత్త రూపు

• మీడియన్లలో 'సినిమాటిక్ వ్యూ' మొక్కలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని ప్రధాన రహదారుల మధ్య ఉండే మీడియన్లలో ఒకే వరుసలో, ఒకే రకమైన మొక్కలను నాటడం ద్వారా ఆహ్లాదకరమైన 'సినిమాటిక్ వ్యూ' వచ్చేలా చూడాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో హార్టికల్చర్ అధికారులు, కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరం ఎంత అందంగా కనిపిస్తుందనేది హార్టికల్చర్ విభాగం పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె చేసిన కీలక సూచనలు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ORR) మీడియన్లలో మొక్కల నిర్వహణ అత్యంత ఆకర్షణీయంగా ఉంటుందని, అదే తరహాలో వరంగల్‌లోనూ పనులు జరగాలని సూచించారు. మీడియన్లలో మొక్కల పెంపకం, నిర్వహణ బాధ్యతల కోసం త్వరలోనే టెండర్లు ఆహ్వానిస్తామని వెల్లడించారు. అలాగే రాబోయే వన మహోత్సవం కోసం నర్సరీల నిర్వహణకు కూడా టెండర్లు పిలుస్తామన్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా క్రమం తప్పకుండా నీరు పోయాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలో ఇటీవల తొలగించిన హానికరమైన కొనోకార్పస్ మొక్కల స్థానంలో వెంటనే కొత్త ప్లాంటేషన్ చేపట్టి, పర్యావరణహిత మొక్కలను నాటాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ రమేష్, హెచ్‌ఓ లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు, సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# బహుజన మహనీయుల స్ఫూర్తితోనే సమన్యాయం

▪ ఐఎల్పీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, అదాలత్ :** "భారతదేశంలో వేల సంవత్సరాలుగా సాగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన బహుజన మహనీయుల చరిత్రే అణగారిన వర్గాలకు అసలైన దిక్సూచి. వారి స్ఫూర్తిని సమాజంలోకి తీసుకెళ్లడం ద్వారానే సమన్యాయం సాధ్యమవుతుంది" అని హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ, వలస సుధీర్ అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కోర్టు ఆవరణలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్-2026 నూతన క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎల్పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ, చట్టం, రాజ్యాంగాన్ని అధ్యయనం చేసే న్యాయవాదులకు దేశ వాస్తవ చరిత్ర తెలియాల్సిన అవసరం ఉందన్నారు. గౌతమ బుద్ధుడు, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, సాహు మహారాజ్, పెరియార్, నారాయణ గురు, బాబాసాహెబ్ అంబేద్కర్, మాన్యశ్రీ కాన్షీరామ్ వంటి 50 మందికి పైగా బహుజన వీరుల చరిత్రతో ఈ క్యాలెండర్‌ను రూపొందించినట్లు తెలిపారు. కాలారాం మందిర్ సత్యాగ్రహం, మహద్ సత్యాగ్రహం, భీమా కోరేగావ్ విజయం, రాజ్యాంగ దినోత్సవం, మనుస్మృతి దహన దినోత్సవం వంటి కీలక తేదీలను ఇందులో పొందుపరిచారు. ఛత్రపతి శివాజీ, బిర్సా ముండా, కొమురం భీమ్, సర్దార్ సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ వంటి వీరుల పోరాటాలు న్యాయవాదులను చైతన్యం చేస్తాయని, ఇది బహుజన రాజ్యాధికార పోరాటానికి బాటలు వేస్తుందని నరేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎల్పీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, దయాల సుధాకర్, చిల్ల రాజేంద్రప్రసాద్, పంచగిరి బిక్షపతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జున్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్, వరంగల్ జిల్లా కన్వీనర్ విలాసాగరం సురేందర్, బార్ నాయకులు చింత సాంబశివరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ



వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి 2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాలైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.




# యుఫోరియాతో

## విజయం సాధిస్తా: గుణశేఖర్

కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకురావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నతస్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. నేటి యువతకు, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిదని ఆయన తెలిపారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.




# హైప్ క్రియేట్ చేసినా.. ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

### సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్

తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. గాంధీ టాక్స్ స్పెషల్ సినిమా ఏం కాదు.. కానీ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని మాత్రం తప్పకుండా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. సినిమా సంప్రదాయ ఫార్మాట్ ను ఫాలో అవకపోవడంతో గాంధీ టాక్స్ చిత్రాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో టీం మెంబర్స్ అంతా మొదట ఆందోళన చెందారని.. అయితే దగ్గరి స్నేహితులకు స్పెషల్ స్క్రీనింగ్ వేసిన తర్వాత పాజిటివ్ స్పందన వచ్చిందని.. దాంతో సినిమాపై నమ్మకం పెరిగిందన్నాడు విజయ్ సేతుపతి. అయితే వారిచ్చిన ఫీడ్ బ్యాక్ సినిమా మార్కెట్ కోసం ఉపయోగపడదని కూడా చెప్పాడు.



# ఒప్పుకోకుంటే లేచి పోదామనుకున్నాం

- పెళ్లి వార్తలపై షాకింగ్ విషయాలు చెప్పిన కీర్తి సురేశ్

'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.





















# దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం

- అధిక నిధులతో శాశ్వత అభివృద్ధికి కృషి
- ఇప్పటికే 80 లక్షలకుపైగా దర్శనం
- మీడియా సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి, సీతక్క

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం సమ్మక్క–సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మంత్రి మాట్లాడుతూ గురువారం వరకు దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్ ఘఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రులు స్పష్టం చేశారు.

### 70 ఎకరాల్లో విస్తరణ : మంత్రి పొంగులేటి

మేడారం జాతర శాశ్వత అభివృద్ధికి ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవున నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప–లక్నవరం–జంపన్న వాగు వరకు పైప్లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్ డ్యాములు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

### దుష్ప్రచారాలను నమ్మొద్దు : మంత్రి సీతక్క

సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్–లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగానికి, మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు

☐ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ

తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ కీలక మలుపు తిరిగింది. తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ను కూడా ఈ కేసులో విచారణ జరిపేందుకు సిట్ అధికారులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే నందినగర్ లోని కేసీఆర్ నివాసానికి వెళ్లిన సిట్ అధికారులు... కేసీఆర్ పీఏకు నోటీసులిచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, వయసు దృష్ట్యా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ కు విచారణకు కేసీఆర్ రావాల్సిన అవసరం లేదని సిట్ అధికారులు తెలిపారు. 65 ఏళ్లు పైబడిన వారు పోలీస్ స్టేషన్ కు విచారణకు తప్పనిసరిగా హాజరు కావాల్సిన అవసరం లేదని సీఆర్పీసీ 160 చట్టంలో ఉందని, కాబట్టి కేసీఆర్ కోరుకున్న చోట విచారణ జరుపుతామని సిట్ అధికారులు తెలిపారు.. అయితే నందినగర్ లోని కేసీఆర్ నివాసంలోనే విచారణ జరిగే అవకాశమున్నట్లు సమాచారం.

## పోస్టల్ ఫ్రాంచైజీలకు దరఖాస్తుల ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ డివిజన్ పరిధిలో ప్రజలకు పోస్టల్ సేవలను మరింత చేరువ చేసేందుకు ఫ్రాంచైజీలను ఇస్తున్నట్లు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ వి.హనుమంతు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఇండియా పోస్ట్ వెబ్సైట్ లో నోటిఫికేషన్ పూర్తి వివరాలను తెలుసుకోవచ్చన్నారు. 18 ఏండ్లు నిండి, ఇంటర్మీడియట్ వరకు చదివి, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్నవారు బుకింగ్ ఫ్రాంచైజీలు తీసుకొనేందుకు అర్హులన్నారు. 10 వ తరగతి వరకు చదివిన అభ్యర్థులు డెలివరి ఫ్రాంచైజీలు తీసుకొనేందుకు అర్హులని వివరించారు. పార్సిల్ బుకింగ్, స్పీడ్ పోస్ట్, ఇంటర్నేషనల్ మెయిల్ సర్వీసులు వంటి సేవలను ఈ ఫ్రాంచైజీల ద్వారా అందించవచ్చని పేర్కొన్నారు. ఆకర్షణీయమైన కమిషన్, ప్రోత్సాహకాలు ఉంటాయని వివరించారు. నిబంధనల ప్రకారం కంపెనీలు, సంస్థలు, అగ్రిగేటర్స్ కూడా ఫ్రాంచైజీలు తీసుకొనేందుకు అర్హులని తెలిపారు. దీనికి సంబంధించిన ఇతర వివరాల కోసం సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, హనుమకొండ డివిజన్ e–మెయిల్ dohanamkonda.ap@indiapost.gov.in కు మెయిల్ చేసి తెలుసుకోవచ్చని హనుమంతు పేర్కొన్నారు.



## మేడారంలో నిరంతర విద్యుత్

☐ విద్యుత్ శాఖ ఏర్పాట్లు

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారంలో రౌండ్ ద క్లాక్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరా తీరు తెన్నులను పర్యవేక్షిస్తున్నారని డైరెక్టర్ ఆపరేషన్, ప్రాజెక్ట్స్ టి.మధుసూదన్, మోహన్ రావు తెలిపారు. విద్యుత్ పరంగా మేడారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా ఎన్పీడీసీఎల్ తీర్చిదిద్దిందన్నారు. వెలుగులు జిగేల్ మనిపించేలా తీరిచిద్దిన మేడారంకు అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది 24/7 పర్యవేక్షిస్తున్నారన్నారు. చీఫ్ ఇంజనీర్లు కె.రాజు చౌహన్, అశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరిండెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుంచి 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచుల్లో 30 మంది చొప్పున విధులు నిర్వహిస్తున్నారనీ చెప్పారు. వీరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో లైన్ పెట్రోలింగ్ చేస్తూ లోపాలను గుర్తిస్తూ సరి చేస్తున్నారన్నారు. రాత్రి, పగలు లేకుండా అహో రాత్రులు కష్టపడుతూ విధులు నిర్వర్తిస్తూ భక్తులకు విద్యుత్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా లైన్లకు స్పేసర్ లు పెట్టడం జరిగిందని, భద్రతకు పెద్దపీట వేశామన్నారు. శాశ్వత ప్రాతిపదికన జంపన వాగు ఇరువైపుల ఆరు టవర్లు ఏర్పాటు చేశామని, నిరంతరం ట్రాన్స్ ఫార్మర్ల వద్ద సిబ్బంది లోడ్ తనిఖీ చేస్తూ ఉంటారని, ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న వెంటనే తెలియజేసేలా రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా వెంటనే సమాచారం కంట్రోల్ రూమ్ కు చేరవేస్తుందని, అక్కడ ఉన్న సిబ్బందికి తెలియజేసి సమస్య పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు విద్యుత్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎక్కడ సమస్య ఉన్న మా సిబ్బందికి తెలపాలని వారు కోరారు.




## జంతు సంరక్షణకు విస్తృత కార్యక్రమాలు

☐ సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా కలెక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లాలో అనేక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా జంతు హింస నివారణ సంఘం చైర్మన్ డాక్టర్ సత్య శారద తెలిపారు. జనవరి 16 నుంచి 31 వరకు తెలంగాణ రాష్ట్ర జంతు సంక్షేమ సంస్థ ఆర్థిక సహకారంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని తెలిపారు. జిల్లాలోని గొర్రెలు, మేకలకు మశూచి వ్యాధి నివారణకు 1,33,236 టీకాలు వేసినట్లు తెలిపారు. అలాగే 13 గ్రామాల్లో ఆడ పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధుల నివారణకు ప్రత్యేక చికిత్సా శిబిరాలు నిర్వహించి 947 పశువులకు వైద్య సేవలు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి బాలకిషన్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వసుమతి, డీపీఓ కల్పన, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి శోభన్ బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com